

దేవన్‌పల్లిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి వేములవాడ ప్రసాదాన్ని అందజేస్తున్న మహిళలు

## తండాలు ఎట్లుండె? ఇప్పుడెట్లయినయ్?

- కొత్త పింఛన్లు, రేషన్ కార్డులిస్తాం
- ఆరోగ్యశ్రీ రూ.15 లక్షల వరకు పెంపు
- భీమ్‌గల్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, నవంబర్ 23 : పదేండ్ల క్రితం తండాలు ఎట్లుండే? ఇప్పుడెట్లయినయో చూడాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి, బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి గిరిజనులకు సూచించారు. ఎన్నో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి ఆ తండాల్లో వారినే సర్పంచులుగా, ఉపసర్పంచులుగా, వార్డు సభ్యులుగా చేసుకునే అవకాశం కల్పించినట్టు చెప్పారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం కారేపల్లి తండా, దేవన్‌పల్లి తండాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తండాలకు డాంబర్ రోడ్లు వేయించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచినట్టు తెలిపారు. గిరిజనులకు పోడు పట్టాలిచ్చి తరతరాలకు భూమి భరోసా కల్పించినట్టు తెలిపారు. జనవరిలో కొత్త పింఛన్లు, కొత్త బీడీ పీఎఫ్ వచ్చిన కార్మికులకు బీడీ పింఛన్లు, కొత్తరేషన్ కార్డులు, మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అర్హులైన వారందరికీ అందిస్తామని అన్నారు. కాగా వేముల మళ్లీ గెలువాలని కోరుతూ భీ మ్‌గల్ మండలం దేవన్‌పల్లికి చెందిన మహిళలు వేములవాడ రాజరాజేశ్వరి ఆలయానికి పాదయాత్ర వెళ్లి మొక్కులు చెల్లించి తిరిగి వచ్చి గురువారం వేములకు స్వామివారి కంకణం కట్టి ప్రసాదం అందజేశారు.

# ఓటేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం

- ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత క్రియాశీలకం కావాలి
- సీఎం కేసీఆర్ ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తున్నది
- నూతన ఓటు హక్కు పొందిన విద్యార్థినులతో ఎమ్మెల్సీ కవిత



కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 23: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటేయాలని, లేకుంటే వ్యవస్థలన్నీ నిర్వీర్యం అవుతాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. నిజామాబాద్‌లో కొత్తగా ఓటు హక్కు పొందిన విద్యార్థినులతో గురువారం ఆమె ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు కవిత సమాధానం ఇస్తూ.. ప్రజాస్వామ్య ప్రక్రియలో యువత క్రియాశీలక భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎవరు గెలిస్తే ఏమిటన్న ధోరణిలో ఉండొద్దని సూచించారు. ఓటు హక్కును వినియోగించుకోకపోతే వ్యవస్థలు నిర్వీర్యమవుతాయని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. రాజకీయాల్లోకి వచ్చే మహిళలు, యువతకు ఏం సందేశమిస్తారని ఓ యువతి అడిగిన ప్రశ్నకు కవిత సమాధానమిస్తూ.. రాజకీయాలు అంత సులువు కాదని, అయితే.. రాజకీయ నాయకులుగా తీసుకునే ఓ నిర్ణయం కోట్ల మంది జీవితాలను మార్చుతుందని, అందుకే కష్టపడి ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. ప్రభుత్వరంగంలోనే కాకుండా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుంది? స్వయం ఉపాధి, జిల్లాల్లో ఐటీ హబ్‌ల ఏర్పాటుపై యువతులు అడిగిన ప్రశ్నలకు కవిత స్పందిస్తూ.. రాష్ట్రానికి దాదాపు 22 వేల కంపెనీలు వచ్చాయని, దాంతో 30 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వచ్చాయని, పరోక్షంగా మరో 30 లక్షల మందికి ఉపాధి లభించిందని వివరించారు. స్వయం ఉపాధి కోసం స్టార్టప్‌లను ప్రోత్సహించి చేయూతనిస్తున్నామని చెప్పారు. టీఎస్ పీఎస్సీలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏం చర్యలు చేపడుతుందని ఓ యువతి అడగగా.. రాష్ట్రంలో ఒకే ఒక్కసారి పేపర్ లీక్ ఉదంతం జరిగిందని, 10 రోజుల్లో నే నిందితులను పట్టుకున్నామని, ఒక రాజకీయ పార్టీ ప్రమేయముందని గుర్తించామని వివరించారు. బీఆర్‌ఎస్‌కు ఎందుకు ఓటేయాలని ఓ విద్యార్థిని ప్రశ్నించగా.. బీఆర్‌ఎస్ పార్టీ అద్భుతమని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్టీ కొట్లాడిందని చెప్పారు. రాష్ట్రం వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తున్నది. అందుకే కారు గుర్తుకు ఓటు వేయాలని కవిత బదులిచ్చారు. తొలిసారి ఓటు వేసినప్పటి అనుభవం చెప్పాలని ఒక విద్యార్థిని కోరగా.. తాను మొదటి నుంచి తన తండ్రికే ఓటు వేశానని, చింతమడకలో తొలిసారి తల్లి దండ్రులతో కలిసి ఓటు వేశానని, అది ఎప్పటికీ మరిచిపోలేని అనుభవం అని చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆడపిల్లలను వేధించేవారి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నదని స్పష్టం చేశారు.



దామరంచలో మాట్లాడుతున్న బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి

## కాంగ్రెస్‌ను నమ్మి మోసపోకండి

**రాజకీయాలు హుందాగా ఉండాలె • ప్రచారంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి**

బాన్సువాడ, నవంబర్ 23: ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోవద్దని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మొదటి నుంచి ప్రజలకు మంచి చేయడమే తెలుసని.. తనపై నిందలు మోపినా ఏ ఒక్కరినీ పల్లెత్తు మాటలు అనలేదని చెప్పారు. కానీ ఇటీవల ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి తన వయస్సును కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాగా ఉండాలని, ప్రజలకు చేసే పనులను చెప్పాలని హితవు పలికారు. ఎల్లారెడ్డిలో ఆయన దౌర్జన్యాల వల్లే అక్కడి ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పినట్టు తెలిపారు. ఎన్నికల ముందు కర్ణాటకలో ఐదు హామీలు ఇచ్చిందని.. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయలేక చేతులు ఎత్తేసిందని విమర్శించారు. తెలంగాణలో ఆరు హామీలు ఇచ్చారని, పొరపాటున కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎవరు సీఎం అవుతారు, హామీలను ఎవరు అమలు చేస్తారని ప్రశ్నించారు. రవీందర్‌రెడ్డి పుట్టింది ఎల్లారెడ్డిలో, ఉండేది హైదరాబాద్‌లో, రేపు సమస్యలు వస్తే ప్రజలు ఎక్కడికి వెళ్లి అడగాలని ప్రశ్నించారు. తాను ఇక్కడే పుట్టిపెరిగాను, ఇక్కడే ఉంటున్నానని తెలిపారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కండ్ల ముందే ఉన్నదని ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. స్పీకర్ వెంట డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.



కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందులలో మాట్లాడుతున్న మంత్రి గంగుల

## బీఆర్‌ఎస్ ఉంటేనే కరెంటు వెలుగులు

**కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ అంధకారమే • కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల**

కరీంనగర్ కార్పొరేషన్/కొత్తపల్లి, నవంబర్ 23: యాభై ఏండ్ల దరిద్రానికి కారణం బీజేపీ, కాంగ్రెస్‌లేనని, ఆ పార్టీలకు ఓటేస్తే తెలంగాణ భవిష్యత్ అంధకారం అవుతుందని బీఆర్‌ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. కరెంటు వెలుగులు కావాల్నా? కాంగ్రెస్ చీకట్లు కావాల్నో ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. గురువారం ఉదయం కరీంనగర్ శివారులోని మానేరు డ్యాం కట్ట వద్ద వాకర్స్‌ను కలిసి ప్రచారం చేశారు. తర్వాత కొత్తపల్లి మండలంలోని శ్రీరాములపల్లి, ఎలగందల్ గ్రామాల్లో, సాయంత్రం నగరంలోని పలు డివిజన్లలో ప్రచారం చేశారు. ఆయా ఓట్ల మంత్రి మాట్లాడుతూ.. బండి సంజయ్‌ని ఎంపీగా గెలిపిస్తే నాలుగున్నరేండ్లుగా పత్తా లేకుండా పోయి, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడిగేందుకు వస్తున్నాడని ప్రశ్నించారు. బీసీ ముఖ్యమంత్రి అని బీజేపీ చెప్పుకొని తిరుగుతున్నా రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదన్నారు. ఆ పార్టీ తెలంగాణలో రెండు సీట్లు కూడా గెలిచే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు.

## కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం పక్కా

- కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం అంధకారమే
- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్‌కు ప్రజల సంపూర్ణ మద్దతు ఉన్నదని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కా వడం లాంఛనమేనని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నేత కేసీఆర్ అని, ఆయన నాయకత్వంతో తెలంగాణ సురక్షితంగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నదని, ఆ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు కర్ణాటకలో అమలు కావడం లేదని దుయ్యబట్టారు. ఒక్క అవకాశం ఇవ్వాలని అడుగుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నల్లగొండ ప్రజలు నాలుగు సార్లు అవకాశం ఇస్తే ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు.

# కేసీఆర్ అచ్చినంకనే ఎదిగినం

**70 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏంజేయలేదు**

- అప్పుడు రైతుబంధు లేదు, నీళ్లు లేవు
- ఇప్పుడు 40 ఎకరాలు సాగుచేస్తున్న
- తోడబుట్టిన అన్నే పదివేలు ఇత్తలేడు..
- సీఎం సారు ఇద్దరు ఆడపిల్లలున్నా కల్యాణలక్ష్మి కింద డబ్బు లు ఇస్తుండు
- శ్రీధర్‌బాబు చేసిందేమీలేదు
- మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధును తప్పకుండా గెలిపించుకుంటం
- పెద్దపల్లి జిల్లా పెంచికల్‌పేట్‌లో ఓ మహిళా రైతు భావోద్వేగం



మంథని, నవంబర్ 23: తెలంగాణ ప్రజలు చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానాలపై నిర్మోహమాటంగా కుండబద్దలు కొడుతున్నారు. సీఎం కేసీఆర్ తన ప్రసంగాల్లో 'రాయేదో.. రత్నమేదో.. అభ్యర్థి ఎవరో.. ఆయన ఏ పార్టీవాడో.. ఆ పార్టీకున్న చరిత్ర ఏందో చూసి ఓటేయాలి. ఇంటికి వెళ్లి చర్చపెట్టాలి' అని చెప్పిన మాటలతో స్ఫూర్తిపొందిన పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన అనవేన రమ్య అనే మట్టి బిడ్డ భావోద్వేగంతో నిష్కల్మషంగా తన అభిప్రాయాలను వెల్లడించారు. గురువారం పెంచికల్‌పేటకు బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారానికి రాగా.. రమ్య మైక్ తీసుకొని 70 ఏండ్ల కాంగ్రెస్ పాలన, పదేండ్ల కేసీఆర్ పాలనను పోల్చిచెప్పారు. అప్పటి కష్టాలు.. ఇప్పుడు అమలవుతున్న పథకాలను వివరించారు. ఆమె మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రమ్య మాటల్లోనే..'అరవై, డెబ్బై ఏండ్లు పాలించింది కాంగ్రెస్ పార్టీ. అప్పుడు మనకు నీళ్లు లేవు.. రైతుబంధు లేదు. రైతుబీమా లేదు.. నీళ్ల ప్రాబ్లం చేయవట్టి కొన్ని వేల ఎకరాల భూములు బీళ్లున్నాయి. కేసీఆర్ తెచ్చిన నీళ్లతో నిరుడు 40 ఎకరాలు సాగు చేయగా, వ్యవసాయంలో మేము బాగా ఎదిగినం. కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, నీళ్లు అన్ని ఇస్తుండు. ఆడపిల్ల కల్యాణానికి తోడబుట్టిన అన్నే 10 వేలు ఇస్తలేడు. ఇద్దరు ఆడపిల్లలున్నా కేసీఆర్ కల్యాణలక్ష్మి ఇస్తుండు. ఇవ్వన్ని చేసిన కేసీఆర్‌ను, మంథని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధును గెలిపించాలి. మధన్న కు ఓటు వేయలేదంటే మన ప్రాణం పోయినట్టే. మా కుటుంబంలో మొత్తం 12 ఓట్లు ఉన్నయ్. ఇవన్నీ పుట్ట మధన్నకే. ముత్తారం మండలం మైదంబండ మా అమ్మవాళ్ల ఊరు. మేము చిన్నప్పటినుంచి శ్రీధర్‌బాబు చూస్తా న్నం. ఆయన చేసిన పనేం లేదు. ఒక్కరు కొట్లాడితే అచ్చేది కాదు. అందరు కొట్లాడాలి.. కచ్చితంగా పుట్ట మధన్నను గెలిపియ్యాలి' అంటూ ప్రసంగాన్ని వినిపించింది. ఆమె ప్రసంగం అనంతరం బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు జై బీఆర్‌ఎస్.. జై కేసీఆర్.. జై పుట్ట మధన్న అంటూ నినాదాలు చేశారు. భావోద్వేగపూరితంగా రమ్య మాట్లాడిన తీరు ప్రతిఒక్కరినీ ఆలోచింపజేసింది.

